క్లుప్తంగా

ఆర్టీసీ రిటైర్డ్ ఉద్యోగులను ఆదుకోవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీలోని వివిధ కేటగిరీలలో పనిచేస్తూ రిటైర్డ్ అయిన ఉద్యోగులను ప్రభుత్వం ఆదుకోవాలని ఏపీఎస్ ఆర్టీసీ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ కడప రీజినల్ సెక్రటరీ రఘునాథరెడ్డి కోరారు. బుధవారం ఆర్ఎం కార్యాలయం వద్ద వైఎస్సార్ రిటైర్డ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ పిలుపు మేరకు ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా రఘునాథరెడ్డి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తమకు కనీసం రూ. 5 వేల జీవనభృతిని మంజూరు చేయాలని కోరుతున్నామన్నారు. కార్యక్రమంలో అసోసియేషన్ నాయకులు, రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారు.

నూతన నియామకం

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కాంగ్రెస్ పార్టీ జిల్లా సెక్రటరీగా పైడికాల్వ నాగరాణి నియమించినట్లు డీసీసీ అధ్యక్షుడు ఉండకుంట శ్రీరాములు పేర్కొన్నారు. బుధవారం నగరంలోని ఇందిరా భవన్‌లో ఆమెకు నియామక పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2024లో రాహుల్ గాంధీని ప్రధాని చేయడమే లక్ష్యంగా పనిచేయాలని కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు చార్లెస్, చంద్రశేఖర్ రెడ్డి, సుబ్రమణ్య శర్మ, గౌసియా, శ్యామలమ్మ తదితరులు పాల్గొన్నారు.

పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్లను చూపుతున్న రామలింగారెడ్డి తదితరులు

కడప కార్పొరేషన్ : విద్యుత్ ఉద్యోగుల అవసరార్థం రూపొందించిన డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఏపీ ఎలక్ట్రిసిటీ వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు రామలింగారెడ్డి, రాష్ట్ర ఉప ప్రధాన కార్యదర్శి ఓ.బ్రహ్మానందరెడ్డిలు పిలుపునిచ్చారు. బుధవారం నగరంలోని డివిజనల్ ఇంజనీర్ వారి కార్యాలయం ప్రాంగణంలో పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈనెల 21న కడప నగరంలోని జిల్లా పరిషత్‌లో డైరీ, క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రతి సంవత్సరం ఉద్యోగులు, కార్మికులకు చట్టాలపైన, విద్యుత్ యాజమాన్యాలు రూపొందిస్తున్న ఆర్డర్ల పైన, హక్కుల పైన అవగాహన కోసం డైరీ రూపొందిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో యూనియన్ సభ్యులు సుచరిత, నవనీశ్వర్ రెడ్డి, మల్లికార్జునరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

లూయీ బ్రెయిలీ విగ్రహం ఏర్పాటు చేయాలి

పులివెందుల టౌన్ : దివ్యాంగుల జీవితాలలో వెలుగులు ప్రసాదించిన మహనీయుడు అంధుల లిపిప్రదాత లూయీ బ్రెయిలీ విగ్రహాన్ని పులివెందుల ప్రధాన కూడలిలో ఏర్పాటు చేయాలని ఏపీ దివ్యాంగుల నెట్‌వర్క్ రాష్ట్ర అధ్యక్షుడు రఘునాథరెడ్డి కోరారు. దివ్యాంగులతో కలసి బుధవారం మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి నివాసంలో ఆయనను కలసి వినతిపత్రం అందజేశారు. పట్టణంలో మోడల్‌సిటీ తరహాలో రోడ్ల విస్తరణ కార్యక్రమాలు, కొత్త సర్కిళ్ల ఏర్పాటు చేస్తున్న నేపథ్యంలో ఏదైనా ఒక కూడలిలో వికలాంగుల లూయీ బ్రెయిలీ విగ్రహాన్ని ఏర్పాటు చేస్తే భావితరాలకు ఆయన అంధులకు చేసిన సేవలను గుర్తించుకుని స్మరించుకుంటారన్నారు. అందుకు ఆయన స్పందిస్తూ ప్రభుత్వానికి నివేదిక పంపి తప్పకుండా ఏర్పాటు చేయిస్తామన్నారు. కార్యక్రమంలో దివ్యాంగుల కార్యదర్శి వెంకటసుబ్బయ్య, సునీల్, చంద్రఓబులరెడ్డి, బాబు, సిద్దారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

కబడ్డీ విజేతగా చియ్యపాడు జట్టు



చియ్యపాడు జట్టుతో అధికారులు, గ్రామస్తులు

చాపాడు : మండలంలోని చియ్యపాడు గ్రామంలో బుధవారం నిర్వహించిన ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన మండల స్థాయి కబడ్డీ పోటీలలో చియ్యపాడుకు చెందిన జట్టు గెలుపొందింది. మదూరు, ఎన్.ఓబాయపల్లె, వెదురూరు జట్లతో తలపడిన చియ్యపాడు జట్టు విజేతగా నిలిచింది. దీంతో చియ్యపాడు జట్టు త్వరలో నియోజకవర్గ స్థాయిలో జరుగనున్న ఆడుదాం ఆంధ్రా కబడ్డీ పోటీలలో పాల్గొనాల్సి ఉందని ఎంపీడీఓ తెలిపారు.

నియామకం

మైదుకూరు : జమ్మలమడుగు రెవెన్యూ డివిజన్ స్థాయి ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా దువ్వూరు మండలం భీమునిపాడుకు చెందిన జేష్టాది రవికుమార్ నియమితులయ్యారు. ఈ మేరకు కమిటీ చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తున్న ఆర్డీఓ జి.శ్రీనివాసులు, రవికుమార్‌కు ఉత్తర్వులు పంపారు. తనను ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ విజిలెన్స్, మానిటరింగ్ కమిటీ సభ్యుడిగా నియమించిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి, అందుకు కృషి చేసిన ఎంపీ వైఎస్ అవినాష్‌రెడ్డి, ఎమ్మెల్యే శెట్టిపల్లె రఘురామిరెడ్డి, నియోజకవర్గ సమన్వయకర్త శెట్టిపల్లె నాగిరెడ్డిలకు రవికుమార్ ధన్యవాదాలు తెలిపారు.

అవ్వాతాతల ముఖాల్లో పింఛనానందం

ఉపముఖ్యమంత్రి అంజద్‌బాషా



'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమంలో బుక్‌లెట్ అందజేస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్ : పింఛన్‌ను రూ.3వేలకు పెంచడంతో అవ్వాతాతల ముఖాల్లో చిరునవ్వులు కనిపిస్తున్నాయని ఉప ముఖ్యమంత్రి, మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి ఎస్.బి అంజద్‌బాష అన్నారు. బుధవారం 'గడప గడపకు మన ప్రభుత్వం'లో భాగంగా.. 46వ డివిజన్ కార్పొరేటర్ ఎం.వి. శ్రీదేవి, ఎమ్మెల్సీ ఎం. వి. రామచంద్రా రెడ్డి ఆధ్వర్యంలో శాస్త్రినగర్ పరిధిలోని డీఎంహెచ్ఓ వీధి సమీపంలోని పలు వీధులు, ప్రాంతాలను సందర్శించారు. తొలుత సాయిబాబా స్కూల్ వద్ద నుంచి ప్రారంభించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజల కోసం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు ఏవిధంగా ప్రజలకు చేరుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వారికి వివరించి, వారు పొందుతున్న లబ్ధి సమాచారం, సీఎం వైఎస్ జగన్ సంతకం చేసిన బుక్ లెట్‌ను అందజేశారు. జి. బాయమ్మ మాట్లాడుతూ జగనన్న వసతి దీవెన, వైఎస్సార్ పింఛన్ కానుక, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ చేయూత, వైఎస్సార్ ఆసరా పథకాల ద్వారా రూ. 10 లక్షల 17 వేల 992 లబ్ధి పొందామని, ఈ ప్రభుత్వానికి ఎల్లప్పుడూ బాసటగా ఉంటామని ఆనందం వ్యక్తం చేసింది. హెచ్. మంగమ్మ మాట్లాడుతూ మన జిల్లా ముద్దుబిడ్డ వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి అయ్యాక ఇంటి స్థలం, ఇంటిని నిర్మించు కోవడానికి నగదు, వైఎస్సార్ సున్నా వడ్డీ, వైఎస్సార్ ఆసరా వంటి పథకాల ద్వారా రూ. 9 లక్షల 12 వేల 731లు లబ్ధి చేకూరిందని, దీంతో మా కుటుంబం అంతా సంతోషంగా ఉన్నామన్నారు. ఇలాంటి ముఖ్యమంత్రి నిండు నూరేళ్లు ఉండాలని కోరుకుంటున్నట్లు తెలిపారు.కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పోచంరెడ్డి సుబ్బారెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులు త్యాగరాజు, రామ్మోహన్‌రెడ్డి, మియ్యా, ఉమైర్, మున్నా, అబ్దుల్ రౌఫ్, సంపత్, మహిళా నాయకురాల్లు టీపీ సుబ్బమ్మ, మరియలు, నసీమ సుల్తానా, మౌలాని, సచివాలయం సిబ్బంది, వాలంటీర్లు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన తప్పనిసరి



మాట్లాడుతున్న పారా లీగల్ వలంటీర్ సురేష్ సహాయం

కడప కోటిరెడ్డిసర్కిల్ : కార్మికులు ప్రభుత్వ పథకాల పట్ల అవగాహన తప్పనిసరిగా కలిగి ఉండాలని పారా లీగల్ వలంటీర్ సురేష్ సహాయం పిలుపునిచ్చారు.జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ, సీనియర్ సివిల్ జడ్జి బాబా ఫకృద్దీన్ ఆదేశాల మేరకు బుధవారం కడప నగరం ఇండస్ట్రియల్ ఎస్టేట్లోగల చైతన్య కెమికల్స్‌లో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పనిచేసే చోట తప్పనిసరిగా ఈపీఎఫ్, ఈఎస్ఐ సదుపాయాలు కలిగించేలా యాజమాన్యం చూసుకోవాలన్నారు. అనంతరం లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ సిస్టం, ఉచిత న్యాయ సహాయం,లీగల్ ఎయిడ్ క్లినిక్, పారా లీగల్ వలంటరీల విధివిధానాల గురించి తెలియజేశారు. అలాగే ఆయుష్మాన్ భారత్ హెల్త్ కార్డు గురించి వివరించారు. కార్మికుల ప్రమాదాలు కాంపెన్సేషన్, ఈ-శ్రమ్ కార్డ్స్ తదితర అంశాల గురించి తెలియజేశారు. ఎలాంటి సమస్య ఉత్పన్నమైనా జిల్లా న్యాయ సేవాధికార సంస్థను సంప్రదించవచ్చని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ చీఫ్ లీగల్ ఎయిడ్ డిఫెన్స్ కౌన్సిల్ ప్రతినిధి, శాంత, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ లేబర్ శ్రీనివాస్, చైతన్య కెమికల్స్ యాజమాన్యం, కార్మికులు పాల్గొన్నారు.

అంబేడ్కర్ విగ్రహావిష్కరణ విజయవంతం చేయండి


కడప కార్పొరేషన్ : విజయవాడలోని స్వరాజ్ మైదానంలో ఈనెల 19వ తేది భారత రాజ్యాంగ నిర్మాత డా, బీఆర్ అంబేడ్కర్ 206 అడుగుల విగ్రహావిష్కరణ మహోత్సవానికి దళితులు, అంబేడ్కర్ వాదులు తరలి రావాలని మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు బండ్ల జయరాజ్ పిలుపునిచ్చారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ, స్మృతి వనం, గ్రంథాలయాలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలందరూ పెద్ద ఎత్తున పాల్గొని జయప్రదం చేయాలన్నారు. దేశంలో సమసమాజ స్థాపన కోసం, పేద ప్రజల అభ్యున్నతి కోసం అంబేడ్కర్ ఎంతో కృషి చేశారని, భారత దేశానికి ప్రపంచంలోనే అతిపెద్ద లిఖిత పూరిత రాజ్యాంగాన్ని ప్రసాదించారన్నారు. ఆ మహోన్నత వ్యక్తిని వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం గుర్తించి ఆయన 206 అడుగుల విగ్రహం ఏర్పాటు చేయడం ప్రజాస్వామ్య చరిత్రలో మైలురాయిగా నిలిచిపోతుందన్నారు.కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శి మేకల సుధాకర్ పాల్గొన్నారు.

ప్రయాణికులతో బస్టాండ్ కిటకిట



కడప కోటిరెడ్డి సర్కిల్ : సంక్రాంతి పండుగ పూర్తయింది. పట్టణం, పల్లెలకు వచ్చిన వారు భోగి సంక్రాంతి కనుమ సంబరాల పూర్తి చేసుకుని తిరుగు ప్రయాణం అవుతున్నారు. ఎక్కువమంది ఆర్టీసీ పైనే ఆధార పడుతుండడంతో బస్సులు కిటకిటలాడుతున్నాయి. బుధవారం రాత్రి ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు ఏర్పడకుండా ఆర్టీసీ అధికారులు చర్యలు చేపడుతున్నారు. జిల్లాలోని కడప బద్వేల్ మైదుకూరు ప్రొద్దుటూరు జమ్మలమడుగు పులివెందుల డిపోల నుంచి అన్ని ముఖ్య పట్టణాలకు బస్సులు ఏర్పాటు చేశారు ప్రయాణికుల రద్దీ ఎక్కువగా ఉండడంతో జిల్లా నుంచి 44 బస్సులు నడుపుతున్నారు వీటిలో హైదరాబాదుకు 23 బెంగళూరు 15 చెన్నై నాలుగు విజయవాడ రెండు బస్సుల చొప్పున ఏర్పాటు చేశారుం కడప ఆర్ఎం గోపాల్ రెడ్డి, డిపో మేనేజర్ ఢిల్లీశ్వరరావు, అసిస్టెంట్ మేనేజర్ కన్యాకుమారి, యూనియన్ నాయకుడు బాబా ఫక్రుద్దీన్ తదితరులు ఏర్పాట్లను పరిశీలించారు.

ఫొటోగ్రఫీలో ఏఎఫ్‌యూ విద్యార్థికి బహుమతి



తృతీయ బహుమతిని అందుకుంటున్న ఏఎఫ్‌యూ విద్యార్థి విల్సన్

ఏఎఫ్‌యూ : కడప నగరంలోని డాక్టర్ వైఎస్ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం ఫొటోగ్రఫీ విభాగం విద్యార్థి జి. విల్సన్‌కు రాష్ట్రస్థాయిలో మూడో బహుమతి లభించింది. విజయవాడలోని కేఎల్ యూనివర్సిటీలో ఈనెల 7 నుంచి 9వ తేదీ వరకు మూడురోజుల పాటు నిర్వహించిన రాష్ట్రస్థాయి యువజనోత్సవాల్లో విల్సన్‌కు తృతీయ బహుమతి లభించింది. యూత్ సర్వీసెస్ ఎంపీ శారదాదేవి చేతుల మీదుగా ఈయన జ్ఞాపిక, ప్రశంసాపత్రం అందుకున్నారు. విశ్వవిద్యాలయ విద్యార్థి ప్రతిభ పట్ల డా. వైఎస్ఆర్ ఏఎఫ్‌యూ వైస్ చాన్సలర్ ఆచార్య బి. ఆంజనేయప్రసాద్, రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి, ఫొటోగ్రఫీ విభాగం సమన్వయకర్త డా. సంపత్‌కుమార్ అభినందించారు.

ఉర్దూ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించండి



మండలి డిప్యూటీ చైర్‌పర్సన్‌కు సమస్యలు వివరిస్తున్న రూటా నేతలు

రాయచోటి అర్బన్ : రాష్ట్రంలోని ఉర్దూ మీడియం పాఠశాలల్లో నెలకొన్న సమస్యలను వెంటనే పరిష్కరింపజేయాలని రాష్ట్ర ఉర్దూ టీచర్స్ అసోసియేషన్ (రూటా) నేతలు ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి, శాసనమండలి డిప్యూటీ చైర్‌పర్సన్ జకియాఖానంలకు విన్నవించారు. బుధవారం వారు పై నేతలను వేర్వేరుగా వారి కార్యాలయాలలో కలుసుకుని తమ సమస్యలను తెలియజేశారు. వారు మాట్లాడుతూ ఉర్దూ డైట్ కళాశాలలో అధ్యాపకులను వెంటనే నియమింపచేయాలన్నారు. ముస్లిం జనాభా అధికంగా ఉన్న గ్రామాలు, పట్టణాల్లో ఉర్దూ మీడియం అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలంటూ కోరారు. 117 జీఓకు సంబంధం లేకుండా ఉర్దూ హైస్కూళ్లకు ప్రధానోపాధ్యాయులు, వ్యాయామ ఉపాధ్యాయులను నియమించాలన్నారు. ప్రతి ఉర్దూ ప్రాథమిక పాఠశాలల్లో కనీసం ఇద్దరు ఉర్దూ ఉపాధ్యాయులు ఉండేలా చూడడం, ఉర్దూ ప్రాథమికోన్నత పాఠశాలల్లో సబ్జెక్టు టీచర్లను నియమింపచేయాలంటూ విన్నవించారు. ఇందుకు స్పందించిన ఎమ్మెల్యే, డిప్యూటీ చైర్‌పర్సన్‌లు సమస్యలను సీఎం జగన్ దృష్టికి తీసుకెళ్లి పరిష్కరింపచేసేందుకు కృషి చేస్తామంటూ హామీ ఇచ్చారు. కార్యక్రమంలో రూటా మహమ్మద్ ఆయూబ్, మహమ్మద్ హాషీం, జాఫరుద్దీన్, మహమ్మద్ అలీ, సబాతుర్ రహిమాన్, ముహిబుల్లా తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ

ప్రొద్దుటూరు క్రైం : ప్రొద్దుటూరు టూ టౌన్ ఎస్ఐగా రామకృష్ణ బుధవారం బాధ్యతలు చేపట్టారు. ఇక్కడ పని చేస్తున్న ఎస్ఐ రెడ్డిసురేష్ మైలవరం మండలానికి బదిలీ అయ్యారు. 2009 బ్యాచ్‌కు చెందిన రామకృష్ణ కడప తాలుకా పోలీస్‌స్టేషన్‌లో పని చేస్తూ ప్రొద్దుటూరుకు బదిలీ అయ్యారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ స్టేషన్ పరిధిలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని చెప్పారు. రానున్న ఎన్నికల నేపథ్యంలో గొడవలు జరగకుండా ముందస్తు చర్యలు తీసుకుంటానని తెలిపారు. సమస్యాత్మక వ్యక్తులు, అసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేకంగా నిఘా పెడతామన్నారు.

23న పల్లవోలులో జగనన్న ఆరోగ్య సురక్ష

చాపాడు : మండలంలోని పల్లవోలు గ్రామంలోని గ్రామ సచివాలయ భవన సముదాయం వద్ద ఈ నెల 23న జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ శ్రీధర్‌నాయుడు తెలిపారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకూ నిర్వహించే శిబిరంలో ఐదు మంది ప్రత్యేక వైద్య నిపుణులతో అన్ని రకాలైన వైద్య పరీక్షలు చేయటం జరుగుతుందన్నారు. గ్రామ ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

ఘనంగా 'గొబ్బెమ్మ' ఊరేగింపు



గొబ్బెమ్మ ఊరేగింపులో నృత్యం చేస్తున్న మహిళలు

సిద్దవటం : మండలంలోని పలు గ్రామాల్లో కనుమ పండుగ సందర్భంగా మంగళవారం రాత్రి గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపు కార్యక్రమాన్ని మహిళలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సిద్దవటంలో గొబ్బెమ్మ అమ్మవారి ఊరేగింపులో స్థానిక మహిళలు, యువత, పెద్ద సంఖ్యలో పాల్గొని గొబ్బెమ్మ పాటలను పాడారు. ఈ పండుగ రోజున ముగ్గులు వేసి ముగ్గుల్లో గొబ్బెమ్మను పెట్టి పసుపు, కుంకుమతో అలంకరిస్తారన్నారు. ముగ్గుల్లో పెట్టే గొబ్బెమ్మను గోదాదేవిగా పూజిస్తారన్నారు. ముగ్గులు, గొబ్బెమ్మలు రెండూ లక్ష్మీదేవికి చాలా ఇష్టమైనవన్నారు. పండుగ రోజుల్లో ముగ్గు మధ్యలో గొబ్బెమ్మను పెడితే ఇంట్లోకి లక్ష్మీదేవిని ఆహ్వానించినట్లేనని మహిళల్లో విశ్వాసమున్నట్లు స్థానిక మహిళలు తెలిపారు.

ప్రతిభను గుర్తించేందుకే క్రీడా పోటీలు



కబడ్డీకి ఎంపికైన జట్టుతో అధికారులు

పెండ్లిమర్రి : గ్రామీణ ప్రాంతాల్లోని క్రీడాకారుల ప్రతిభను గుర్తించేందుకే ఆడుదాం ఆంధ్ర క్రీడా పోటీలు నిర్వహిస్తున్నామని ఎంపీడీవో జగన్‌మోహన్‌రెడ్డి తెలిపారు. పెండ్లిమర్రి జూనియర్ కళాశాలలో బుధవారం మండలస్థాయి బ్యాడ్మింటన్, కబడ్డీ పోటీలు నిర్వహించారు. బ్యాడ్మింటన్‌లో పాతసంగటిపల్లె మహిళా జట్టు, కబడ్డీలో నందిమండలం పురుషుల జట్టు ఫైనల్‌లో విజయం సాధించి నియోజకవర్గ స్థాయికి ఎంపికైయ్యాయన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ శివరామిరెడ్డి, పంచాయతీ కార్యదర్శులు లక్ష్మిపతి, సుధాకర్, ప్రశాంత్ సాగర్ పాల్గొన్నారు.

నకిలీ ఎరువులు విక్రయిస్తే చర్యలు తప్పవు

గోపవరం : నకిలీ ఎరువులు, పురుగు మందులు విక్రయిస్తే సంబంధిత డీలర్లపై చర్యలు తప్పవని బద్వేలు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎం.నాగరాజ హెచ్చరించారు. బుధవారం టి.వి.మోహన్‌రాజ ఎరువులు, పురుగు మందుల దుకాణాన్ని ఆయన తనిఖీ చేశారు. గడువు తీరిన పురుగు మందులు, గడ్డ కట్టిన పాత ఎరువులు రైతులకు విక్రయించవద్దని, 15 రోజులకొకసారి స్టాకు వివరాలను వ్యవసాయాధికారికి తెలియజేయాలన్నారు. ఎరువులు, పురుగు మందుల కోసం వచ్చిన రైతుల వివరాలు సేకరించి బయోమెట్రిక్ వేయించడంతో పాటు ఎమ్మార్పీ ధరలకు మించకుండా అమ్మకాలు జరపాలన్నారు.

ఘనంగా శ్రీకృష్ణ దేవరాయల జయంతి



శ్రీకృష్ణ దేవరాయలు చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బలిజ అభ్యుదయ సేవా సంఘం ప్రతినిధులు

కడప కల్చరల్ : ఆదర్శ పాలకులు శ్రీకృష్ణ దేవరాయలు 533వ జయంతిని బుధవారం కడప నగరంలో ఘనంగా నిర్వహించారు. బలిజ సంఘం ప్రతినిధి సగినాల శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక నేక్‌నామ్‌ఖాన్ కళాక్షేత్రంలో ఈ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా తొలుత వేదికపై ఏర్పాటు చేసిన శ్రీకృష్ణ దేవరాయలు చిత్రపటానికి పాలాభిషేకం, అనంతరం పుష్పాంజలి ఘటించి రాయల చరిత్రను మననం చేసుకున్నారు. నగర బలిజ ప్రముఖులు దుర్గాప్రసాద్ మాట్లాడుతూ శ్రీకృష్ణదేవరాయలు సాహిత్య, ఆధ్యాత్మిక రంగాల్లో ఎంతో కృషి చేశారని, ప్రధానంగా రైతుల క్షేమం కోరి ఆయన తవ్వించిన చెరువులు నేటికీ ఆయా ప్రాంతాల రైతాంగానికి ప్రాణవాయువుగా నిలిచాయన్నారు. ఆయన స్ఫూర్తితో బలిజలు ఐక్యంగా నిలిచి సమస్యల పరిష్కారానికి కృషి చేయాలని సూచించారు. ప్రముఖ పారిశ్రామికవేత్త అమరప్ప, ఎమ్మెల్సీ సి.రామచంద్రయ్య, పలు పార్టీలకు చెందిన బలిజ నాయకులు హరిప్రసాద్, సుంకర శ్రీనివాస్, నాగరాజు, సమతం రాము, బండారు సత్యనారాయణ, బండి బాబు, వేణు, రమణ, బాస్ సంస్థ అధ్యక్షులు దాసరి శివప్రసాద్, డ్రైవర్ల సంఘం అధ్యక్షులు కొండయ్య, ప్రభుత్వ ఉద్యోగుల సంఘం ప్రతినిధి మస్తాన్‌రావు రాయల్, తోట రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్న నేతలంతా తాము ఐక్యంగా ఉన్నామని, భవిష్యత్తులో కూడా ఇదే ఐక్యత కలిగి ఉంటామని చేయిచేయి కలిపి సంఘీభావం ప్రకటించారు.

'బాస్'ఆధ్వర్యంలో

శ్రీకృష్ణ దేవరాయలు 533వ జయంతిని బలిజ అభ్యుదయ సేవా సంఘం (బాస్) ఆధ్వర్యంలో నకాష్‌లోని సంస్థ కార్యాలయంలో నిర్వహించారు. రాయల చిత్రపటానికి పూలమాల వేసి కేక్ కట్ చేశారు. అనంతరం బైక్‌ల్లో ర్యాలీగా శ్రీకృష్ణ దేవరాయల కూడలికి వెళ్లి అక్కడి రాయల విగ్రహానికి పాలాభిషేకం నిర్వహించారు. కార్యక్రమంలో సంస్థ సభ్యులు కొమ్మినేని సుధీర్, రాఘవ, దేవినేని వెంకటేశ్, చంద్ర, బండారు తరుణ్ ముని మోహన్, నీలం రవి, ముగ్గరాళ్ల కృష్ణప్ప, దుర్గాప్రసాద్, తోట రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

తగ్గనంటున్న కూరగాయల ధరలు

కడప అగ్రికల్చర్ : కూర గాయల ధరలు తగ్గనంటున్నాయ్. దీంతో సామాన్యుడికి పచ్చడి మెతుకులు తప్పడం లేదు. పచ్చిమిరపకాయ, టమాట ధరలు అధికంగా ఉన్నాయి. మొన్నటి దాకా కిలో రూ. 10 ఉన్న టమాటా ధర మళ్లీ రూ. 25 చేరింది. అలాగే మిరపకాయలు కూడా కిలో రూ. 40 చేరింది. దీంతో పచ్చడి మెతుకులు తిందామన్నా వీలుకాని పరిస్థితి. మిగతా కూరగాయల పరిస్థితి కూడా అలాగే కొనసాగుతోంది. కిలో బీన్స్ రూ. 70, అనపకాయలు, క్యాప్సికం, చేమగడ్డలు కిలో రూ. 60, క్యారెట్, అలసందలు, చిక్కుడుకాయ, మటిక్కాయ, కాకరకాయలు కిలో రూ. 50, బీట్‌రూట్, దొండకాయ, బజ్జీమిరప, క్యాలీఫ్లవర్, కిలో రూ. 40, బంగాళాదుంప, దోసకాయ, బీరకాయలు కిలో రూ. 35, క్యాబేజీ, ముల్లంగి, బెండకాయలు కిలో రూ. 30, వంకాయ కిలో రూ. 25, సొరకాయ కిలో రూ. 20 చొప్పున కడప రైతు బజార్‌లో ధరలు కొనసాగుతున్నాయ. దీంతో కూరగాయల కొని తినాలంటే భారంగా ఉందని సామాన్యులు చెబుతున్నారు.ఈ ధరలు కొన్ని రోజులు ఇలాగే కొనసాగే అవకాశం ఉన్నట్లు రైతు బజార్, కూరగాయల షాపుల నిర్వాహకులు తెలిపారు.

ఇది రామకార్యం..ఐక్యతతో జయప్రదం చేద్దాం



మాట్లాడుతున్న ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి

కడప కల్చరల్ : శ్రీరామ క్షేత్ర తీర్థ ట్రస్టు ఆధ్వర్యంలో ఈనెల 22న అయోధ్యలో జరగనున్న శ్రీ బాలరాముని విగ్రహ ప్రతిష్ట సందర్భంగా కడపలో తలపెట్టిన శ్రీరామ శోభాయాత్రను రామకార్యంగా భావించాలని, ఐక్యతతో నిలిచి కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు సిద్ధం కావాలని పలువురు హిందూ ధార్మిక వేత్తలు, సంఘాల ప్రతినిధులు పిలుపునిచ్చారు. బుధవారం కడప నగరం హౌసింగ్ బోర్డులోని శ్రీ కోదండ రామాలయంలో ఆలయ ధర్మకర్త డి.వెంకటరెడ్డి, ప్రధాన ప్రతినిధి చెన్నకృష్ణారెడ్డిల పర్యవేక్షణలో నగరానికి చెందిన పలు దేవాలయాల ప్రతినిధులు, నిర్వాహక కమిటీ సభ్యులు, విశ్వహిందూ పరిషత్, ఆర్‌ఎస్‌ఎస్ ప్రతినిధుల విస్తృత స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శ్రీరామ శోభాయాత్ర ఐక్య వేదిక ఆధ్వర్యంలో కార్యక్రమాన్ని తలపెట్టామని, చిన్నచౌకులోని శ్రీ వీరాంజనేయస్వామి ఆలయం వద్దనుంచి ఉదయం 7 గంటలకు శోభాయాత్ర ప్రారంభమవుతుందని తెలిపారు. యాత్ర కోసం పటిష్టమైన ఏర్పాట్లు చేస్తున్నామని, పార్టీలకు అతీతంగా హిందూ బంధువులంతా పాల్గొనాలని కోరారు. అందరూ ర్యాలీలో సంప్రదాయ వస్త్ర ధారణతో పాల్గొనాలని, బొట్టు లేదా తిలకధారణ చేయాలన్నారు. ఆలయం వద్ద నుంచి ప్రత్యేకమైన రథంలో 18 అడుగుల శ్రీరాముని విగ్రహంతో వేద పండితుల పూజలతో ర్యాలీ మొదలవుతుందన్నారు.చెన్నకృష్ణారెడ్డి మాట్లాడుతూ క్రమశిక్షణతో, ఒకరినొకరు సమన్వయం చేసుకుంటూ యాత్రను జయప్రదం చేయాలని సూచించారు. ధార్మిక సంస్థల ప్రతినిధి రాణా ప్రతాప్ మాట్లాడుతూ ఇప్పటివరకు ర్యాలీకి సంబంధించి తీసుకున్న చర్యలు, చేస్తున్న ఏర్పాట్ల గురించి వివరించారు. నాడు జరిగిన కరసేవలో ప్రాణాలు అర్పించిన వారి బంధువులను ఈ సందర్భంగా సత్కరిస్తున్నామని తెలిపారు. 22న రామాలయంలో విగ్రహ ప్రతిష్ట అనంతరం సాయంత్రం నగర సమీపంలోని పాలకొండల్లో ధార్మిక ప్రముఖుడు సట్టి భారవి ఆధ్వర్యంలో మారెమ్మ ఆలయ భక్తబృందం అఖండ శ్రీరామ జ్యోతిని వెలిగిస్తుందని కార్యక్రమ నిర్వాహకులు తెలిపారు.కార్యక్రమంలో నగర ప్రముఖులు రాజోలి వీరారెడ్డి, దుర్గాప్రసాద్, సుంకర శ్రీనివాస్, దేవతి శంకరయ్య, అర్చక సంఘం అధ్యక్షులు విజయ్‌భట్టర్, ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మునగా శ్రీనివాస్, మిస్టర్-వి వర్మతోపాటు నగరానికి చెందిన పలువురు ధార్మిక సంఘాల ప్రతినిధులు, భక్త ప్రముఖులు పాల్గొన్నారు.

వెలిగల్లు పార్కు అభివృద్ధి పట్టదా?



వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టులోని పార్కును పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

గాలివీడు : మండలంలోని వైఎస్సార్ వెలిగల్లు ప్రాజెక్టు సమీపంలోని పార్కును ఏ మాత్రం పట్టించుకోవడం లేదని సీపీఐ రాయచోటి నియోజకవర్గం కార్యదర్శి శ్రీనివాసులు పేర్కొన్నారు. బుధవారం సీపీఐ నాయకులతో కలిసి పార్కు పరిసరాలను పరిశీలించారు. మాట్లాడుతూ నిత్యం పార్కుకు వచ్చే సందర్శకులకు పార్కులో కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు పూర్తిగా విఫలమైనట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు. సందర్శకుల సంఖ్య రోజురోజుకు పెరుగుతున్నప్పటికీ పార్కులో మురుగునీటితో ఈత కొలను, ఆట వస్తువులు శిథిలావస్థకు, విరిగిన బల్లలకు మరమ్మతులు చేయకపోవడం బాధాకరమన్నారు. కనీసం పార్కులో చెత్తాచెదారం తొలగించి పరిశుభ్రతను పాటించకపోవడం దారుణమన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి పార్కులో పరిశుభ్రతతోపాటు మంచి వాతావరణం కల్పించే విధంగా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఆయనతోపాటు బీఎస్పీ అన్నమయ్య జిల్లా అధ్యక్షులు యుగంధర్, సీపీఐ మండల సహాయ కార్యదర్శి కృష్ణమూర్తి, ఏఐఎస్ఎఫ్ నాయకులు కార్తీక్‌నాయక్ తదితరులు ఉన్నారు.

బీసీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యం



సంఘీభావం తెలుపుతున్న ఎమ్మెల్సీ రమేష్‌యాదవ్, బీసీ సంఘాల నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : బీసీల ఐక్యతతోనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్సీ ఆర్.రమేష్ యాదవ్ పేర్కొన్నారు. స్థానిక పద్మశాలీయ కల్యాణ మండపంలో మేలుకో బీసీ ప్రజా తంత్ర రాజకీయ చర్చా వేదిక నిర్వహించారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్, మహాత్మా జ్యోతిరావుపూలే చిత్రపటాలకు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీలు కలసికట్టుగా ఉంటే ఏదైనా సాధించుకోవచ్చని అన్నారు. రాజకీయాల్లో ఎదుగుతున్న బీసీలకు సహకరించాలని కోరారు. బీసీల సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి గొర్రె శ్రీనివాసులు మాట్లాడుతూ బీసీలను అన్ని రాజకీయ పార్టీలు ఓటు బ్యాంకుగా వాడుకున్నాయని అన్నారు. వారికి రాజ్యాధికారం కల్పించే దిశగా చర్యలు తీసుకోలేదని చెప్పారు. బీసీలు రాజకీయంగా, సామాజికంగా, ఆర్థికంగా అభివృద్ధి చెందాల్సిన అవసరం ఉందన్నారు.పబ్లిక్ ప్రాసిక్యూటర్ చెన్నా సరళాదేవి మాట్లాడుతూ బీసీలు అంటే వెనుకబడిన వారు కాదని, అన్ని రంగాల్లో రాణించే నేర్పు వారికి ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో బీసీలకు ఎమ్మెల్యే, ఎంపీ టికెట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ పాణ్యం సావిత్రమ్మ మాట్లాడుతూ బీసీలు రాజ్యాధికారం పొందినప్పుడే అన్ని విధాలా అభివృద్ధి చెందుతారని తెలిపారు. మల్లేల భాస్కర్ మాట్లాడుతూ రాజకీయ రిజర్వేషన్లు ఇస్తే తప్ప బీసీలు అభివృద్ధి చెందే పరిస్థితి లేదన్నారు. బీసీ నాయకులు బొర్రా రామాంజనేయులు, సందు శివనారాయణ, చౌడం కొండయ్య, చెన్నా వెంకటకృష్ణయ్య, పాణ్యం సుబ్బరాయుడు, కృష్ణయ్య, జింకా సుబ్రహ్మణ్యం, బడిగించల చంద్ర మౌళితోపాటు పలువురు బీసీ సంఘాల నాయకులు, పెద్దలు పాల్గొన్నారు.